హనుమాన్ దేవాలయ హుండీ లెక్కింపు

ఆరునెలలకుగాను ఆలయానికి రూ. 2.86 లక్షల ఆదాయం


హుండీ లెక్కిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు తదితరులు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్‌లోని హనుమాన్ దేవాలయంలో ఆరు నెలలకుగాను హుండీ లెక్కింపు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం దోమలగూడ హనుమాన్ దేవాలయ భక్తుల సమక్షంలో దేవాదాయ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ బి. సురేఖ, ఆలయ ఈవో దేవనాదం ల సమక్షంలో ఆలయ అర్చకులు మూడు హుండీలను తెరిచి లెక్కించారు. రూ. 2లక్షల 86వేల 10 రూపాయలు భక్తులు కానుకల రూపంలో ఆలయానికి వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.ఆర్.కె. ప్రసాద్, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, మురళీకృష్ణ, కరుణాకర్, కె. లక్ష్మీనారాయణ, పరమేశ్, శేఖర్, హరికృష్ణ, శ్రీధర్, రాము, రవికుమార్, శే మహేందర్, లక్ష్మణ్‌తో పాటు భక్తులు హాజరై దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జీఓ 29ని రద్దు చేయండి


అనూహ్యారెడ్డి, బీజేపీ నాయకురాలు

కాచిగూడ: గ్రూప్–1 అభ్యర్థుల రిజర్వేషన్లకు ఇబ్బందికరంగా ఉన్న జీవో 29ను తక్షణం రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యురాలు డాక్టర్ జి.అనూహ్యారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవలంబిస్తున్న వింత పోకడలతో అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సోమవారం సుప్రీంకోర్టులో కేసువాదనలు, మరోపక్క రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్–1 పరీక్ష నిర్వహణ జరుగుతోందన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిన విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. గతంలో ఉన్న జీవో 55ను అమలు చేసేలా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. జీవో 29 తో లక్షలాది మంది విద్యార్థులు గ్రూప్–1 చదవలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. మరిన్ని ఉద్యమాలకు తాము పిలుపునివ్వాల్సి వస్తుందని అనూహ్యారెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విద్యార్థులకు కనీస వసతులను కల్పించాలి

కార్పొరేటర్ ఏ.పావని వినయ్‌కుమార్


పిల్లలకు అన్నం వడ్డిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, హెచ్‌ఎం

చిక్కడపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఏ. పావని వినయ్‌కుమార్ అన్నారు. జవహర్‌నగర్ టీఆర్‌టీలోని ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం కార్పొరేటర్ ఏ.పావని వినయ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా మూత్రశాలలు, మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఏ.వినయ్‌కుమార్, హెచ్‌ఎం మేడే దేవదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్–1 అభ్యర్థులపై లాఠీచార్జ్ సరికాదు


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి

కాచిగూడ: గ్రూప్–1 అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో జీవో నెంబర్ 55 ప్రకారమే గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం నారాయణగూడలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. యూపీఎస్సీ తరహాలోనే ప్రిలిమ్స్‌హాల్ టికెట్ నెంబర్లతోనే మెయిన్స్ ఆన్సర్ బుక్‌లెట్లపై ముద్రించి పరీక్ష నిర్వహించాలన్నారు. జనరల్ కోటాలో ఎంపికైన రిజర్వేషన్ అభ్యర్థులకు జనరల్ కోటాలో పరిగణించకుండా రిజర్వేషన్ కోటాలో పరిగణించడంతో ఇతర అభ్యర్థులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. సమస్యను పరిష్కరించి విద్యార్థులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అభ్యర్థులపై ప్రభుత్వం లాఠీచార్జ్ చేయడం అమానుషమన్నారు. ఎస్ఎఫ్ఐ నేతలు లెనిన్ చేగువేరా, శ్రీమాన్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డుకు ఎంపిక


ఎట్టయ్య, హైకోర్టు న్యాయవాది

కాచిగూడ: మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు –2024కు హైకోర్టు అడ్వొకేట్, సామాజిక కార్యకర్త గద్దగూటి ఎట్టయ్యను ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ, శాంతి, మత సామరస్యం, జాతీయ సమైక్యత కోసం నిరంతరం కృషి చేస్తూ.. గత 15 ఏళ్లుగా ఉచిత న్యాయ శిబిరాలను నిర్విరామంగా నిర్వహిస్తున్నందున గట్టయ్యను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ అహింస దినోత్సవం ముగింపు ఉత్సవాల సందర్భంగా ఈనెల 22న బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో గట్టయ్యకు ఈ అవార్డును బహుకరించనున్నట్లు చెప్పారు. రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్సీలు డా.బండా ప్రకాష్, బుగ్గారపు దయానంద్, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సుప్రీంకోర్టు న్యాయవాది డీఎల్. పాండు తదితరులు హాజరవుతారని తెలిపారు.

విశ్రాంత బ్యాంక్ ఉద్యోగుల
పెన్షన్ అప్‌డేట్ చేయాలి

పలువురు వక్తలు


ఇందిరాపార్కు ధర్నాలో నినాదాలు చేస్తున్న రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగులు

కవాడిగూడ: విశ్రాంత బ్యాంక్ ఉద్యోగుల పెన్షన్ అప్‌డేట్ చేయాలని అఖిల భారత రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో కోఆర్డినేషన్ ఆఫ్ బ్యాంక్ పెన్షనర్స్, రిటైరీస్ ఆర్గనైజేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ పెన్షనర్స్, రిటైరీస్ కాన్ఫిడరేషన్ ఏపీ, టీజీ స్టేట్ యూనిట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగల సంఘం ప్రతినిధులు డాక్టర్ అనంత కృష్ణారావు, మధుసూదన్‌రావు, రోహిణిరావు, ఉప్పు సుధాకర్, మురళీ, సూర్యనారాయణ మూర్తి, సుబ్బారావు తదితరులు మాట్లాడుతూ బ్యాంక్ వర్కింగ్ ఉద్యోగులతో సమానంగా వారికి జీతాలు పెంచినప్పుడల్లా పెన్షన్ కూడా పెంచాలని, కమ్యూటెడ్ పెన్షన్‌ను పదేళ్ల తరువాత రీస్టోర్ చేయాలని బ్యాంక్ యాజమాన్యాలను డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య బీమా బ్యాంకులే చెల్లించే విధంగా అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల సమాఖ్యతో ఒప్పందం కుదుర్చుకోవాలని వారు పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులంతా ఐక్యంగా ఉండి పోరాటం చేసినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ, దేనా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫెడరల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తదితర బ్యాంకులకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టెన్షన్... టెన్షన్..!

- గ్రూప్–1 అభ్యర్థుల ఆందోళనతో అట్టుడికిన అశోక్‌నగర్
- ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్ నుంచి తెలుగుతల్లి ఫ్లైఓవర్ వరకు నాలుగు గంటల పాటు ఉత్కంఠ
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం


నిరసన కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్

ముషీరాబాద్/కవాడిగూడ/చిక్కడపల్లి: జీవో నెంబర్ 29 రద్దు చేయాలని, సోమవారం నుంచి జరిగే గ్రూప్–1 పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని డిమాండ్ చేస్తూ గత మూడు రోజులుగా చేస్తున్న ఆందోళన శనివారం తీవ్రరూపం దాల్చింది. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అశోక్‌నగర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టిన గ్రూప్–1 అభ్యర్థులు సీఎం డౌన్ డౌన్, వీ వాంట్ జస్టిస్, జీవో 29 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారికి బీజేపీ నేతలు కూడా తోడవ్వడంతో ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. దీనికి తోడు కేంద్ర మంత్రి బండిసంజయ్ కూడా మద్దతు ప్రకటించడానికి రావడంతో నిరుద్యోగ అభ్యర్థులకు నైతిక స్థైర్యం మరింత లభించింది. అభ్యర్థులతో పాటు బైఠాయించిన బండి సంజయ్ వారితో కలిసి చలో సెక్రటేరియట్‌కు ముందుకు సాగడంతో వేలాదిమంది నిరుద్యోగ అభ్యర్థులు ఆయనతో అడుగులు వేశారు. ఈ పరిణామంతో అవాక్కైన పోలీసులు చేసేది ఏమి లేక బండి సంజయ్‌ను ఎంత బుజ్జగించిన ఫలితం లేకపోవడంతో రామకృష్ణ మఠం వద్ద మరోసారి చర్చలు జరిపారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులను కాదన్న అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరకున్నారు. అక్కడ బీఆర్ఎస్ నేతలు కూడా వారిని తోడైయ్యారు. ఒక దశలో బీఆర్ఎస్ నేతలపై బీజేపీ కార్యకర్తలు దాడికి యత్నించారు. ఎట్టకేలకు బండి సంజయ్‌ను, బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, దాసోజు శ్రావణ్, గజ్జల నాగేష్, ముఠా జైసింహ తదితరులను అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.


గ్రూప్–1 అభ్యర్థుల నిరసనలో మహిళా అభ్యర్థులు

29న మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారాలు ప్రదానం

చిక్కడపల్లి: సీల్‌వెల్ కార్పొరేషన్ , శృతిలయ ఆర్ట్స్, ఆర్.ఆర్.ఫౌండేషన్ల సంయుక్తాధ్వర్యంలో సీల్‌వెల్ సుస్వరాలు 64 శీర్షికతో సినీ సంగీత విభావరిని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు బండారు సుబ్బారావు, బొక్కా భీమ్‌రెడ్డిలు తెలిపారు. శనివారం సాయంత్రం వారు వివేక్‌నగర్‌లో మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఏటుకూరి కృష్ణమూర్తిలకు సీల్‌వెల్ శృతిలయ జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 29న సాయంత్రం 4.30 గంటలకు త్యాగరాయగానసభలో ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

సన్మానం

కవాడిగూడ: బీఆర్ఎస్ పార్టీ నూతన డివిజన్ అధ్యక్షులుగా నియమితులైన శంకర్ ముదిరాజ్ శనివారం ఎమ్మెల్యే ముఠాగోపాల్, యువ నాయకుడు ముఠా జైసింహను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శంకర్ ముదిరాజ్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్రీనివాస్ యాదవ్, కేశవపురం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్


పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి : నిత్య వ్యాయామాలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. వరల్డ్ ఆస్టియాపోరోసిస్ డేను పురస్కరించుకొని శనివారం రవి హీలియోస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని శ్రీ పంచముఖ ఆంజనేయ, శ్రీలక్ష్మీ వేంటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉచిత వైద్యశిబిరాన్ని ముఠాగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ శ్రీదేవిలు బీఎండీ పరీక్షలు నిర్వహించి అవరసమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

నల్లకుంట: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి చెందిన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్సై శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. గోల్నాకలో నివాసం ఉండే సుంకరి కృష్ణయ్య కుమార్తె శిల్ప(34) విప్రో ఉద్యోగిని. కాగా ఈనెల 16న ఉదయం 5.30ల సమయంలో ఆమె ప్రయాణిస్తున్న క్యాబ్ (టీజీ09 టి0278)లో ఆర్టీసీ ఎక్స్‌రోడ్డు ఆవరణలో ఓ ఫుట్‌పాత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు ఆమెకు గాయాలయ్యాయి. హుటాహుటీనా ఇద్దరిని చిక్కడిపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె శనివారం సాయంత్రం మృతి చెందింది. పంచనామా అనంతరం పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏఐవైఎఫ్ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్, తదితరులు

కాచిగూడ: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 27,28 తేదీల్లో గోదావరిఖనిలో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. శనివారం నారాయణగూడలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువజన సామర్థ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ పెట్టు బడిదారీ వ్యవస్థలపైనే ఆధారపడటం ద్వారా దేశ ఆర్థిక సమతుల్యత సాధ్యం కాదన్నారు. ఈ చర్యల మూలంగా దేశంలో గత పదేళ్లుగా వందలాది ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడ్డాయన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ నేతలు షేక్ మహమూద్, కల్యాణ్, వంశీ, లక్ష్మణ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయాలి


మాట్లాడుతున్న గద్ద యాదయ్య మాదిగ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో దళితుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టాలి అనుకున్న అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గద్ద యాదయ్య మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గద్ద యాదయ్య మాదిగ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పథకం కోసం బడ్జెట్‌లో రూ. 17,700 కోట్ల నిధులను కేటాయించి ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా స్వయం ఉపాధి వంటి రంగాలకు నిధులు విడుదల చేయలేదని అన్నారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి అంబేడ్కర్ అభయహస్తం పథానికి నిధులు విడుదల చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి నిజాయితీగా ఖర్చుచేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ తిరుపతి మాట్లాడుతూ దళితుల్లో సామాజిక మార్పు తీసుకు వచ్చేందుకు అంబేడ్కర్ అభయహస్తం పథకం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు బి.ఎన్ రమేష్ మాదిగ, బంధు సొసైటీ అధ్యక్షులు పల్లెల వీర స్వామి, ఆంజనేయులు, మిట్టగడుపు పురుషోత్తం, దొమ్మాటి శివకుమార్, మీసాల ఎల్లేష్ మాదిగ పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకు ప్రమోషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న డాక్టర్ వైద్యనాథ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం : తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులకు సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వ్యవసాయ అధికారుల సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వైద్యనాథ్ మాట్లాడుతూ అన్ని కేడర్స్‌లో సీనియార్టీ ప్రకారం జాబితాను తయారు చేయాలని ఆయన కోరారు. ప్రతి వ్యవసాయ అధికారికి వాహనంతో పాటు ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, అధికారులకు ఇతర సౌకర్యాలు కూడా కల్పించాలని ఆయన కోరారు. వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే బదిలీలు సైతం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కృపాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శిథర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అనురాధ, కోశాధికారి రవీందర్, మహిళా ఉపాధ్యక్షురాలు వీణారెడ్డి, ప్రచార కార్యదర్శి మానస తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

ప్రభీర్ పుర్ కాయస్తా



సదస్సులో మాట్లాడుతున్న ప్రభీర్ పుర్ కాయస్తా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని న్యూస్ క్లిక్ చీఫ్ ఎడిటర్ ప్రభీర్ పుర్ కాయస్తా అన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా సిద్ధాంత కర్త, నిబద్ధ నేత సీతారాం ఏచూరి వ్యాస సంకలనాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రభీర్ పుర్ కాయస్తా మాట్లాడుతూ అందరి గొంతుకగా ఉన్న ఏచూరిపై అత్యంత బలమైన సందేశంతో ఈ వ్యాసాలు రాయడం గొప్ప పరిణామం అన్నారు. 800 ఏళ్ళ తరువాత హిందూ దేశం విజయాన్ని సాధించిందని మోదీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, ముస్లింలకు హిందువులకు మధ్య పోటీ జరిగిందన్న భావంతో చెప్పారని విమర్శించారు. వైవిధ్య భరితమైన సుసంపన్న దేశం భారతదేశమన్నారు. భిన్నమైన మతాలు, సంస్కృతులు ఉన్న ఈ దేశంలో ఒకే నాయకులు ఒకే దేశం అనే నినాదం పనికిరాదని అన్నారు. హైకోర్టు సీనియర్ అడ్వొకేట్ జి. విద్యాసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలుకపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరులో జాప్యం

ఎమ్మెల్యే ముఠాగోపాల్


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజవర్గానికి చెందిన 12మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ముఠాగోపాల్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరులో జాప్యం జరుగుతుండంతో లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అధికారులు దృష్టిసారించి వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మాధవ్, ముఠా నరేష్, శంకర్ ముదిరాజ్, ఎం.ప్రభాకర్, పాశం రవి, శ్రీధరాచారి, రాజ్‌కుమార్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ రామాలయంలో కార్తీకమాస మహోత్సవాలు

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి దేవస్థానం (న్యూ రామాలయం) ప్రాంగణంలోని పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస మహోత్సవాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు తెలిపారు. కార్తీక మాసోత్సవాలు నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు కార్తీక మహాన్యాస పూజలు, కార్తీక మాస ఏక రుద్రాభిషేకం, కార్తీక మాస నెలవారి దీపం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏక రుద్రాభిషేకాలు ఉంటాయని చెప్పారు. శనివారం ఆలయంలో శివాలయం అర్చక స్వామి జ్ఞానేశ్వర్‌తో కలిసి ఆయన కార్తీక మాస మహోత్సవాల వివరాలను వెల్లడించారు. భక్తులు ఇతర వివరాల కోసం ఆలయ పూజారి, ఆలయ గుమస్తాను సంప్రదించాలని కోరారు. ఆలయ ధర్మకర్తలు ఎస్. వెంకటేశ్వరరావు, ఎ. మధుకుమార్, వై. మురళీ, మధుసూధన్, మురళీ కృష్ణ, ఆర్. ఓంప్రకాష్, మంజుల పాల్గొన్నారు.

విదేశీ విద్య స్కాలర్‌షిప్ విడుదల చేయాలి


గుజ్జ సత్యం, బీసీ నాయకులు

కాచిగూడ: విదేశీ విద్య స్కాలర్‌షిప్ వెంటనే బడ్జెట్ విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా విదేశీ విద్య స్టైఫండ్ మంజూరు చేసిన వారికి బడ్జెట్ విడుదల చేయకపోవడంతో విదేశాల్లో చదువుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు, బ్రహ్మణ విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. ప్రభుత్వం స్టైఫండ్ మంజూరైనా, సకాలంలో బడ్జెట్ విడుదల కాకపోవడంతో ఆయా యూనివర్సిటీల్లో ఫీజులు కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. కొందరు విద్యార్థులు ఆర్థిక స్తోమత లేక అప్పులు దొరకక మధ్యలోనే చదువులు మానేసి భారత్‌కు తిరిగి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూఎస్ఏ, ఇంగ్లాండ్, కెనడాలో చదువుతున్న విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విదేశీ విద్య స్టైఫండ్ వెంటనే విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు టి.సాగర్ తదితరులు

చిక్కడపల్లి: తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చైతన్య సేద్యం రైతుల మాసపత్రిక వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో నేతలు మూడ్ శోభన్, రాహుల్, శివకుమార్‌లతో కలసి ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 25న ప్రతికూల వాతావరణం రైతు, పంటల బీమా అవసరాలు అనే అంశంపై రాష్ట్ర స్థాయి సెమినార్‌ను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తామన్నారు.

రాంనగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలిగా అవకాశం ఇవ్వండి

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎస్.కల్పన



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాంనగర్ డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎస్. కల్పన కోరారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాను రెండుమార్లు డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశానని అందువల్ల తనకే అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆమె అధిష్ఠానాన్ని కోరానని తెలిపారు. గతంలో ఈ అధ్యక్ష పదవి నాకు ఇవ్వాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్ రెడ్డిలను కోరడం జరిగిందన్నారు. అయితే ఆ పదవిని తనకు ఇవ్వకుండా రాంనగర్ ప్రాంతానికి చెందిన నీలమ్మకు అవకాశం ఇచ్చి నాకు అన్యాయం చేశారని గుర్తు చేశారు. ఈసారి ఆ పదవిని బాగ్‌లింగంపల్లికి చెందిన తనకే ఇవ్వాలని ఆమె కోరారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

అంబర్‌పేట: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి ఆకాంక్షించారు. డీడీ కాలనీలోని అకాడమిక్ హైట్స్ పాఠశాల విద్యార్థులు ఇటీవల ఢిల్లీలో జరిగిన క్రీడా టోర్నమెంటులో పలు క్రీడల్లో విజేతలుగా నిలిచారు. దీంతో శనివారం డీడీ కాలనీలోని పాఠశాల ఆవరణలో విద్యార్థులను డీసీపీ అభినందించారు. విద్యార్థి దశలోనే అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. పాఠశాల రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్లు, రూపారెడ్డి, కౌశిక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అభినందన కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి